ప్రజాశక్తి

బుధవారం 10 మే 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా







బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్డీవో తాసిల్దార్ వైసిపి నాయకులు

చింతలమడ ప్రమాద బాధితులకు

రూ.23.50 లక్షలు పంపిణీ

ప్రజాశక్తి - అవనిగడ్డ : గతేడాది మే 26న చల్లపల్లి మండలం చింతలమడ గ్రామానికి చెందిన పెళ్లి బృందం సభ్యులు ప్రయాణిస్తున్న వాహనం కాసా నగర వద్ద ప్రమాదానికి గురైన సంఘటనలో మరణించిన ఐదుగురు కుటుంబ సభ్యులకు, తీవ్రంగా గాయపడిన 17 మందికి మంగళవారం నష్టపరిహారం అందజేశారు. అవనిగడ్డ ఎంఎల్ఎ సింహాద్రి రమేష్ బాబు, ఆర్‌డిఒ ఐ.కిషోర్, తహశీల్దార్ కె.గోపాలకృష్ణ చేతుల మీదుగా బాధితులకు నష్టపరిహారం అందజేశారు. ఈ ఘటనలో మరణించిన కోన వెంకటేష్, బూరేపల్లి వెంకటేశ్వరమ్మ, బూరేపల్లి వెంకటరమణ, గుర్రం విజయలక్ష్మి, మద్దాల మాధవరావుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున అందించారు. గాయపడిన మరో 17 మందికి రూ.50 వేల చొప్పున చెక్కులను అందజేశారు. మొత్తం రూ.23.50 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు కృషితో ప్రభుత్వం నుండి బాధితులకు సహాయం అందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావు, అవనిగడ్డ ఎంపిపి తుంగల సుమతి దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, లక్ష్మీపురం పురిటిగడ్డ, అవనిగడ్డ సర్పంచులు కొల్లూరు వెంకటేశ్వర రావు, మాతంగి రమ్య, గొరుముచ్చు ఉమా, వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు గుర్రం బసవయ్య, ఆగ్రో డైరెక్టర్ మెరుగు ఝాన్సీ, సచివాలయాల నియోజకవర్గ కన్వీనర్ మద్ది చిన్న, ఎంపీటీసీ సభ్యులు ద్వారకనాథ్, మాజీ ఎంపీటీసీ శీలం సత్యనారాయణ, పార్టీ నాయకులు వి.లక్ష్మి, మద్దాల వీరాస్వామి, అబ్దుల్ నసీం గోరి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం కృతజ్ఞతలు

చింతలమడ (మిగతా 6లో)

లక్ష్యం రూ.532 కోట్లు

రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా నిర్ణయం

గతేడాదికన్నా రూ.174.07 కోట్లు పెరుగుదల

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ సబ్ రిజిస్టార్ కార్యాలయాలకు నూతన ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించింది. కృష్ణాజిల్లాలోని 13 సబ్ రిజిస్టార్ కార్యాలయాల పరిధిలో గత 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1,00,885 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా 357 కోట్లా 60 లక్షల 62 వేల రూపాయల మేర ఆదాయం వచ్చింది. దీనికిగాను మరో 174 కోట్లా 7 లక్షల 56 వేల మేర లక్ష్యాన్ని పెంచింది. దీంతో జిల్లా లక్ష్యం రూ.531 కోట్లా 68 లక్షల 18 వేలుగా నిర్ణయించారు.

విజయవాడ పరిసర ప్రాంతాల్లోనే అధికం

వ్యవసాయ భూముల అమ్మకాలు, రియల్ వెంచర్లు, ఆస్తి మార్టుగేజ్ తనఖాలు తదితరాల ద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం సమకూరుతుంది. కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నం నగరపాలక సంస్థగా, గుడివాడ ఏ గ్రేడ్ మున్సిపాల్టీగా ఉన్నా ఆయా కేంద్రాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకన్నా విజయవాడ పరిసర ప్రాంతాల్లోని కార్యాలయాల ద్వారానే ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం సమకూరింది. కంకిపాడు, గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రియల్ వెంచర్‌లు, ప్లాట్ల లావాదేవీలు ఎక్కువగా ఉండటంతో ఈ కార్యాలయాల ఆదాయాలు ఎక్కువుగా ఉన్నాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఆదాయాలు లక్ష్యాలు పెంపు ఇలా

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	గత ఏడాది ఆర్జన (లక్షల్లో)	ఈ ఏడాది లక్ష్యం (లక్షల్లో)
అవనిగడ్డ	1245.05	1852.6
బంటుమిల్లి	687.63	1022.35
చల్లపల్లి	803.71	1194.94
గుడివాడ	3540.7	5264.24
కానుమోలు	1527.42	2270.94
కవుతవరం	783.81	1165.35
మొవ్వ	1110.26	1650.71
పామర్రు	1205.82	1792.79
పెడన	1223.34	1818.84
మచిలీపట్నం	4280.64	6364.37
గన్నవరం	6938.22	10315.61
కంకిపాడు	10009.72	14882.25
ఉయ్యూరు	2403.3	3573.18
మొత్తం	35760.62	5316.18

'విజేత' విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



భవానీపురం విజేత విద్యాసంస్థల విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : పదవ తరగతి పరీక్ష ఫలితాల స్ఫూర్తితో ఉన్నత విద్యలో రాణించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు విద్యార్థులకు సూచించారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన భవానీపురం విజేత విద్యాసంస్థల విద్యార్థులు మంగళవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డిల్లీరావును కలిశారు. పదో తరగతి పరీక్షల్లో విజేత విద్యా సంస్థలో విద్యనభ్యసించిన అవనిగడ్డ సాయిగీతిక 582 మార్కులు, కొత్తపల్లి దీపికా 577, వై జాహ్నవి 573, జి.రాహుల్ 565, సిహెచ్ హరిప్రియ 562 మార్కులు సాధించిన్నట్లు కలెక్టర్ డిల్లీరావుకు విద్యా సంస్థల కరస్పాండెంట్ యరడ్ల ఆంజనేయరెడ్డి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కోట్లాదిరూపాయలు మంజూరు చేసి కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక (మిగతా 6లో)

సంక్షేమ విద్యాసంస్థల్లోనూ బాలికలదే పైచేయి

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు
ఎస్‌సి గురుకులాల్లో 83 శాతానికి పైగా ఉత్తీర్ణత

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

పదో తరగతి ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఎస్సీ వసతి గృహాల విద్యార్థులు 73 శాతం, ఎస్టీ గురుకులాల విద్యార్థులు 71, సాంఘి సంక్షేమ రెసిడెన్షియల్ విద్యార్థులు 83.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొత్తం 14 సాంఘిక సంక్షేమ వసతి గృహాల ఉన్నాయి. వీటి నుంచి 190 మంది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 104 మంది పాస్ కాగా 86 మంది ఫెయిల్ అయ్యారు. 118 మంది బాలురు హాజరైతే 61 మంది పాస్ కాగా 57 మంది పరీక్షలు తప్పారు. అదేవిధంగా 72 మంది బాలికలు హాజరు కాగా 43 మంది పాసయ్యారు. 29 మంది ఫెయిల్ అయ్యారు. గంపలగూడెం వసతి గృహం నుంచి ఎక్కువ మంది పాసయ్యారు. 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ నుంచి 18 పరీక్షలు రాయగా 14 మంది సాస్ కాగా నలుగురు ఫెయిల్ అయ్యారు. నందిగామ బాయ్స్ హాస్టల్ (స్పెషల్) విద్యార్థులు తక్కువ సంఖ్యలో పాసయ్యారు. 12 మంది పరీక్షలు రాస్తే కేవలం 4 మాత్రమే పాస్ కాగా 8 మంది ఫెయిల్ అయ్యారు. అంటే కేవలం 33.33 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అలాగే జగ్గయ్యపేట వసతి గృహం నుంచి 23 మంది ఎగ్జామ్స్‌కు హాజరైతే కేవలం 9 మంది పాస్ కాగా మిగిన 14 మంది ఫెయిల్ అయ్యారు. పెనుగంచిప్రోలు బాలుర వసతి గృహం నుంచి పరీక్షలుకు హాజరైన ఒక విద్యార్థి ఫెయిల్ అయ్యారు. కంబంపాడు హాస్టల్ నుంచి ఇద్దరు పరీక్షలు రాస్తే ఒకరు ఫెయిల్ కాగా మరొకరు ఉత్తీర్ణత సాధించాడు. అలాగే మైలవరం బాలుర వసతి గృహానికి చెందిన ముగ్గురు పరీక్షలు రాస్తే ఇద్దరు పాస్ కాగా ఒకరు తప్పారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 83.5శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఏడు రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్నాయి. వీటి నుంచి 545 మంది పరీక్షలకు హాజరయ్యారు. 455 మంది పాస్ కాగా 90 మంది ఫెయిల్ అయ్యారు. పాసైన వారిలో 346 మంది ఫస్ట్ క్లాస్, 80 మంది సెకండ్, 29 మంది థర్డ్ క్లాస్ సాధించారు. గురుకులాల్లో కూడా బాలికలే ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించారు. నందిగామ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించారు. దాదాపు 97.5 శాతం పాసయ్యారు. ఈ స్కూల్ నుంచి 80 మంది పరీక్షలకు హాజరు కాగా 78 మంది పాసయ్యారు. కేవలం ఇద్దరు మాత్రమే ఫెయిల్ అయ్యారు. కుంటుముక్కల బాలికల పాఠశాల నుంచి 78 మంది పరీక్షలు రాస్తే 78 మంది పాసయ్యారు. కృష్ణారావుపాలెం బాలుర పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన వారిలో 60 మంది పాస్ కాగా 16 మంది ఫెయిల్ అయ్యారు. తిరువూరు బాలుర స్కూల్ నుంచి పరీక్షలకు హాజరైన వారిలో ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు. 73 మంది పరీక్షలు రాస్తే 31 ఫెయిల్ కాగా 42 మంది మాత్రమే పాసయ్యారు. జగ్గయ్యపేట బాయ్స్ రెసిడెన్షియల్ నుంచి 6, నర్సాపురం బాలికల పాఠశాల నుంచి 10, రంగాపురం బాలికల స్కూల్ నుంచి 17 మంది పరీక్షలు తప్పారు. కుంటుముక్కల పాఠశాలకు చెందిన జి అర్చన 535, కృష్ణారావుపాలెం స్కూల్‌కు చెందిన జయక్రాంత్ 538, జగ్గయ్యపేట బాలికల రెసిడెన్షియల్‌కు చెందిన కే కీర్తన 571, నర్సాపురం పాఠశాల నుంచి జి స్పందన 559 అత్యధికంగా మార్కులు సాధించారు. ఇక బిసి వసతి గృహాలు, గురుకులాల నుంచి 76 మంది పరీక్షలకు హాజరు కాగా 45 మంది పాసయ్యారు. ఎస్టీ గురుకులాలు, ఆశ్రమ పాఠశాల నుంచి 232 నుంచి మంది పరీక్షలు రాయగా 162 మంది పాసయ్యారు. జిల్లాలో ఉన్న ఏకైక ఆశ్రమ పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన వారిలో 12 పాస్ కాగా ముగ్గురు తప్పారు.

గంజాయి ప్రమేయం లేదు

స్నేహితుల ఘర్షణలో వ్యక్తి మృతిపై సిపి రాణా

ప్రజాశక్తి - విజయవాడ : ఇయర్ ఫోన్స్ కనిపించని విషయంలో జరిగిన గొడవుల్లో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ (సిపి) కాంతిరాణా టాటా తెలిపారు. కృష్ణాజిల్లా ఎస్‌పి పి జాషువాతో కలిసి మంగళవారం నగరంలోని తన ఛాంబర్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటన వివరాలను వెల్లడించారు. మరణించిన చెందిన అజయ్‌సాయి, మరో ఐదుగురు పెనమలూరు ప్రాంతానికి చెందిన వారు. ఈనెల 7వ తేదీ సాయంత్రం వీరంతా సంతోష్ అనే వ్యక్తి ఇంట్లో కలిశారు. అయితే మణికంఠ అనే వ్యక్తి ఇయర్‌పోన్స్ పోవడం, దానిపై అజయ్‌సాయిపై అనుమానం రావడం, ఎనికేపాడు విజయా ఎలక్ట్రానిక్స్ ప్రాంతంలో ఇయర్‌ఫోన్స్‌ను వెతుకుతున్న క్రమంలో మళ్లీ వీరి మధ్య ఘర్షణ జరగడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈఘర్షణలో అజయ్‌సాయిని కొట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అక్కడే ఉన్న నాగార్జున, మణికంఠ, మరో స్నేహితుడు అతడిని బైక్‌పై డొంకరోడ్డులోని విజయా ఆస్పత్రిలో చేర్చారు. అయితే వైద్యులు చికిత్స ప్రారంభించిన గంటకే అజయ్‌సాయి చనిపోయాడు. దీంతో వైద్యులు కంకిపాడు పోలీస్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ముగ్గురి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. అయితే మీడియాలో గంజాయి మత్తులో, గంజాయి ప్రభావం వల్ల ఈ ఘర్షణ జరిగిందని అసత్య ప్రచారం జరిగిందని సిపి రాణా తెలిపారు. ఈ ఘటనను విచారించిన తర్వాత గంజాయి ప్రభావం లేదని తేలిందన్నారు. మీడియా అసత్య ప్రచారం చేయొద్దని హితవు పలికారు. కృష్ణాజిల్లా ఎస్‌పి జాషువా మాట్లాడుతూ కొన్ని మీడియా ఛానళ్లు, పత్రికలు కావాలని పోలీసులపై బురదజల్లే వార్తలు రాయడం, ప్రసారం చేయడం చేస్తూ అప్రదిష్టపాలు చేయాలనుకోవడం శోచనీయమన్నారు. ఇప్పటివరకు కృష్ణాజిల్లా పరిధిలో 91 గంజాయి కేసులు నమోదు చేసి, 324 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, 61 మందిపై కేసు నమోదు చేసి, వారిని జైలుకు కూడా పంపామని తెలిపారు. మరో 19 మందిపై పీడీ యాక్ట్ కింద నమోదైన కేసులు కలెక్టర్ (మిగతా 6లో)

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అధిక మొత్తంలో మద్యం బాటిల్స్‌తో పట్టుబడ్డ వ్యక్తిని పట్టుకుని కేసు నమోదుచేసి వన్‌టౌన్ పోలీసులు అరెస్టుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ. ఆర్. వెంకటేశ్వర రెడ్డి మరియు సిబ్బందికి ముందుగా రాబడిన సమాచారం మేరకు విజయవాడ వన్‌టౌన్ శివాయలం వీధి శోభనాద్రి వీధిలో మంగళవారం ఉదయం 4 గంటలకు బెంగాలీకి చెందిన స్వపన్ మజీ అనే వ్యక్తిని పట్టుకొన్నారు. అతని వద్ద బీరు బాటిల్స్ 12, 180 ఎంఎల్ బాటిల్స్ 26 మొత్తం కలిపి 38 బాటిల్స్ లభించాయి. దీంతో అతన్ని పట్టుకుని అరెస్టుచేసి కోర్టుకు హాజరు పర్చగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ రావి సురేష్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : స్థానిక అంబేద్కర్ సెంటర్ జే.జే.యం మందిరం ఆవరణలో జే.జే.యం మరియు ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హెూప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ డాక్టర్స్ చే ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంను రాష్ట్ర ప్రభుత్వవిప్, సామినేని ఉదయభాను మంగళవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇలాంటి ఉచిత మెగా వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హెూప్ సంస్థ డాక్టర్స్ జంపాల శ్రీనివాస్, రవితేజ, అజిత్, పాస్టర్ జోసెఫ్ పాల్, సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి,రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామా రావు, మండల పార్టీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికులకు పథకాలు నిలిపివేయడం దుర్మార్గం

విసన్నపేట : విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విస్సన్నపేట సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఆరు సంవత్సరాల నుండి కార్మికులకు సంబంధించిన పథకాలు నిలిపివేయడం దుర్మార్గమన్నారు. కార్మికులకు రావలసిన పెండింగ్ క్లైములు కార్డులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞాన రత్నం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమం . సిఐటియు మండల కార్యదర్శి షేక్ బాషా.బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గంజినబోయిన రాము ఆకుల సత్యనారాయణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల ప్రెసిడెంట్ మర్రిబోయిన అప్పారావు సెక్రెటరీ పోతురాజు(శ్రీనివాసరావు) శాంతారావు మంగపతి రసూల్ ఏసుబాబు. తదితరు కార్మికులు పాల్గొన్నారు

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంనందు మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో బాగంగా కథలు చదివించడం, కథలు చెప్పించడం, బి డి సి నాగమల్లిక న్యూస్ పేపర్ తో బ్యాగ్ తయారు చేసి చూపించటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని శ్రీమతి ఆలేటి ప్రభ మరియు కవి, ఉపాధ్యాయులు డి.నాగేశ్వరావు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని పాత మున్సిపల్ సెంటర్లో జగ్గయ్యపేట పద్మశాలి సంక్షేమ సంఘం సేవా కార్యక్రమంలో భాగంగా 17 వ రోజు మంగళవారం ప్రముఖ ఆర్ఎంపీ వైద్యులు జల్లా వెంకటేశ్వరరావు సహకారంతో చల్లటి ఆయుర్వేద మజ్జిగను 2500 మందికి అందజేశారు. సంఘ అధ్యక్షులు పెనుమల్లి చంద్రమౌళి మాట్లాడుతూ తొలకరి వర్షాలు పడి వాతావరణం లో మార్పు వచ్చేంతవరకు నిరంతరం చల్లటి మజ్జిగను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అందించడం జరుగుతుందన్నారు. సంఘ పెద్దలు ప్రతినిధులు యేశాల సీతారామమూర్తి, యలగందుల శ్రీనివాసరావు, బొట్ల వీరభద్రం, పొట్టబత్తిన రఘునాథ్, యాపిల్ శీను, గోశిక శ్రీను పాల్గొన్నారు.

మత్స్యకారులకు ద్విచక్రవాహనాలు అందజేత

ప్రజాశక్తి కంచికచర్ల : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. కంచికచర్ల మండలంలో మత్స్యకార లబ్దిదారులకు ప్రభుత్వం సబ్సిడీ పై మంజూరు చేసిన ద్విచక్ర వాహనాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మత్స్యకారులు వినియోగించుకోవాలని కోరారు. చేపల వేట విక్రయమే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారుల జీవన ప్రమాణ స్థాయిని పెంచేలా, వారికి ఆర్థిక తోడ్పాటు అందించేలా వైయస్ జగన్ ప్రభుత్వం మత్స్యకారులకు సబ్సిడీపై వాహనాలను, ఐస్ బాక్సులను, ఫిష్ ఆంధ్ర నాలుగు చక్రాల వాహనాలను, వేట పనిముట్లను, పరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మత్స్యకార సహకార సంఘ సభ్యులకు మొత్తం 22 ద్విచక్ర వాహనాలు మంజూరు కాగా నందిగామ నియోజకవర్గానికి 4 వాహనాలు మంజూరయ్యాయని, వాటిలో కంచికచర్ల మండలంలోని కునికినపాడు సహకార సంఘానికి 3, వీరులపాడు మండలంలోని జయంతి గ్రామంలో 1 వాహనం మంజూరయ్యాయని తెలిపారు. మత్స్యకార సహకార సంఘాల్లో సభ్యులైన జాలర్లు, మత్స్యశాఖ నుంచి లైసెన్సు పొందిన మత్స్యకారులు ఎవరైనా అర్హులు ఉంటే సబ్సిడీ వాహనాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, కునికినపాడు సర్పంచ్ బండారుపల్లి సత్యనా రాయణ వేల్పుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్కుల్లోని అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ : రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కు, అంబేద్కర్‌పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ ఆదేశించారు. నగర కమిషనర్ మంగళవారం అధికారులతో కలిసి కృష్ణలంక వారధి ప్రక్కన రాణిగారి తోట రిటైనింగ్ వాల్ దగ్గర రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును, కృష్ణలంక జాతీయ రహదారి ప్రక్కన ఉన్న అంబేద్కర్ పార్కును క్షేత్ర స్థాయిలో పర్యటించి, పార్కుల్లో జరుగుతున్న పనులను , గ్రీనరీని కమిషనర్ పరిశీలించారు.రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కు పనుల్లో ఎటువంటి పురోగతి లేకపోవడంతో అధికారులపై కమిషనర్ మండిపడ్డారు. వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకొని పనులను పూర్తి చేయకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకర రావు, ఎస్ఇ నరసింహమూర్తి, ఎడిహెచ్ శ్రీనివాసు, డిసిపి జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, వి.చంద్ర శేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరిముల్లా, శానిటరీ ఇన్స్ పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల అదనపు ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : హజ్ యాత్రికుల ఛార్జీల రు.83 వేల అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని జనసేన పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదనపు భారం విషయంలో హజ్ కమిటీ ఏం చేస్తుందని ప్రశ్నించారు. అదనపు భారాన్ని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు తగ్గిస్తుందో తెలియదు కాబట్టి ఈ రూ.83 వేల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా సరే విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లాలని నిబంధన వలన ముస్లిం మైనార్టీల యాత్రకు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. గన్నవరం నుంచి వెళ్లకపోతే ప్రభుత్వం ఇచ్చే రూ. 60 వేల ఆర్థిక సాయం నిలిపివేస్తామనే విధానం వలన ముస్లిం మైనార్టీలు హజ్ యాత్రకు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వైసీపీతోనే అభివృద్ధి సాధ్యమని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం స్థానిక భవానీపురంలో గల 39,40,42,43,44 డివిజన్ల పరిధిలో గల ఆర్‌టిసి వర్క్‌షాప్‌రోడ్డును రూ.3 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవం, అలాగే రూ.46.98 లక్షల నిధులతో నిర్మించనున్న సైడు కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని రోడ్డును ప్రారంభించి కాలువలకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డుకి శంకుస్థాపన మేమేచేసాం,ప్రారంభం కూడా మేమే చేశామన్నారు. నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర, యరడ్ల అంజనేయ రెడ్డి, ఇర్ఫాన్, మైలవరపు దుర్గారావు, మైలవరపు కృష్ణ, దుర్గగుడి ఛైర్మన్ కర్నాటి రాంబాబు, జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షులు గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల భాగస్వామ్యం అభినందనీయం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ప్రకృతి వైపరీత్యాలు విపత్తులు ఆపద సమయంలో ప్రజలకు సేవలందించడంలో అగ్రగామి అయిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి విజయవాడ రూరల్ పంచాయతీ కార్యర్శులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటికి సహకారం అందించేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పిలుపు నిచ్చారు.విజయవాడ రూరల్ పంచాయతీ కార్యదర్శులు అధికారుల సంఘం ముందుకు వచ్చి లక్ష రూపాలయల ఆర్థిక సహాయపు చెక్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావుకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ప్రకృతి వైపరిత్యాలు, విపత్తులు, ఆపద సమయాలలో ప్రజలకు విశేషమైన సేవలందిస్తున్నారన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరుపున సాధ్యమైనంత వరకు ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉద్యోగులు వారికి తోచిన విధంగా రెడ్ క్రాస్ సొసైటికి ఆర్థిక సహాయ కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఆర్వో కె. మోహన్ కుమార్, డిపివో జె. సునీత, విజయవాడ రూరల్ మండలం ఇన్చార్జ్ యంపి డివో బొర్రా శేషగిరి రావు, మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు జి టివి.రమణ, వివిఎస్ ప్రకాష్ నాద్ పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే జరిమానా

ప్రజాశక్తి - గంపలగూడెం : గ్రామాల్లో రోడ్ల వెంట వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం వేసి బాటసారిలకు, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని గంపలగూడెం ఎంపీడీవో వై పి రెడ్డి తెలిపారు. పారిశుధ్యంలో భాగంగా తోటమూల కట్టలేరు వద్ద వివిధ గ్రామాల నుండి చికెన్ సెంటర్ల వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారాలు వేయడంతో దుర్వాసన పుడు తుంది. దీనిని నివారించే భాగంలో మంగళ వారం ఆయన సందర్శించి మాట్లా డారు. ఇటువంటి వారిపై చర్యలతో పాటు పదివేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పంట నష్టపరిహారం అందించాలని ధర్నా

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : అకాల వర్షాలకు దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని,. రబీ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని టీడీపీ డిమాండ్ చేసింది. విజయవాడ రూరల్ మండల కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జాహ్నవి కి వినతి పత్రాన్ని అందజేశారు. నాణ్యత కోల్పోయిన వివిధ పంటలను కూడా కొనుగోలు చేయాలని,నష్టపోయిన వరి,జొన్న,మొక్కజొన్న రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందజేయాలని కోరింది.మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని,రాయితీ పై విత్తనాలు అందజేసి రైతులను ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో టీడీపీ మండల అధ్యక్షులు గొడ్డళ్ళ చిన రామారావు, రైతు నాయకులు రంగినేని నరేంద్ర బాబు,గంపా శ్రీనివాస్ యాదవ్, వేములకొండ నాగరాజు, నబిగాని కొండ, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలో రైతులు, రైతు నాయకులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కి రైతు సమస్యలపై టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయారు. రైతులు పండించిన పంటలకు గిట్టు బాటు ధరలు లేవు. రైతు బారోసా, పంట నష్ట పరిపోరం, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం చెందారు. రైతు బారోసాను రైతు దగా చేశారు. రైతులకు వెంటనే పంటల భీమా ప్రీమియం ను ప్రభుత్వం చెల్లించి రైతులు పండించి నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహరావు, కానూరి కిషోర్ బాబు, యానాల గోపీచంద్, పొట్టపొంగు బాబూరావు, దోగుపర్తి విష్ణు వర్ధన్,పేరం సైదేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గంపలగూడెం : జిల్లాలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం నాడు స్థానిక మండల పార్టీ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి మాట్లాడారు. దెబ్బతిన్న మామిడి రైతులను, మిర్చి రైతులను, ప్రభుత్వమే ఆదుకోవాలని, రబి సీజన్లో కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి, సీనియర్ నాయకులు వై పుల్లయ్య చౌదరి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ విషయమై సంబంధిత వినతిపత్రం తాసిల్దార్ కార్యాలయంలో అందజేశారు.



గంపలగూడెంలో...

ప్రజాశక్తి నందిగామ : అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు కొనుగోలు చేసి రైతన్న ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్న, ధాన్యం, మిర్చి, పత్తి, అపరాల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతన్న ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నందిగామ ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నందిగామ మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి , టిడిపి నందిగామ పట్టణ అధ్యక్షులు ఏచూరి రాము, తెలుగు రైతు నాయకులు అమ్మినేని జ్వాల, తోట నాగమల్లేశ్వరరావు, వేల్పుల బిక్షాలు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం : టిడిపి డిమాండ్

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారంనాడు వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు కొనసాగాయి. **పెదపారుపూడి :** పెదపారుపూడి మండలంలోని యలమర్రు గ్రామంలో మొక్కజొన్న రైతులకు నష్ట పరిహారం ఇప్పించాల్సిందిగా టిడిపి మండల నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం మంగళవారం అందించారు. ఈ సందర్భంగా టిడిపి మండల


ఉయ్యూరులో



పమిడిముక్కలలో


పెదపారుపూడిలో

అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి మాట్లాడుతూ యలమర్రు గ్రామంలో వాక రాము అనే రైతు తమ 20 ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగుచేశారన్నారు. ఈ ఏడాది కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న పంట పూర్తిగా నేలపాలై మొక్కలు మొలిసి పూర్తిస్థాయిలో పంట దెబ్బతిందన్నారు. వ్యవసాయ అధికారుల ద్వారా పర్యవేక్షించి సదరు రైతుకు నష్టపరిహారం ప్రభుత్వం నుండి వచ్చే విధంగా సహకరించాలని కోరారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన వరి ధాన్యం రైతు భరోసా కేంద్రం, సొసైటీల ద్వారా రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించారని పేర్కొన్నారు. ఆన్లైన్ లతో కొంతమంది ఖాతాలో నగదు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించి ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్ చేసి ధాన్యం డబ్బులు రైతు ఖాతాలో జమ అయ్యేవిధంగా చూడాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి), ప్రధాన కార్యదర్శి ముసిముక్కు రాంబాబు, మండల లీగల్ అడ్వైజర్ గొర్రెపర్తి రవికుమార్, మాజీ ఎంపీపీ కాజా విజయలక్ష్మి, నియోజకవర్గ నాయకులు కలపాల కిషోర్, దానబోయిన వెంకటనారాయణ, గుండపనేని శ్రీనివాసరావు, కాగిత లక్ష్మీనారాయణ, కూచిపూడి సుబ్బయ్య, చెరుకూరి విజయ్ కుమార్, దగాని లెనిన్, జాస్తి రామచంద్రరావు, గోగం రామారావు, అభిమన్యుడు, జిమ్మీ బాబు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** అకాల వర్షాలకు తడిసి పాడైయిన పంటలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఉయ్యూరు మండల టీడీపీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన పసుపు, మొక్కజొన్న పంటలను కొనుగోలుచేసి ఆఫ్లైన్లో మిల్లులకు తోలిన ధాన్యాన్ని ఆన్లైన్లైసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ చేస్తూ ఉయ్యూరు మండల, పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం స్థానిక ప్రధాన సెంటర్ నుంచి ఉయ్యూరు ఆర్డీవో, మండల తహశీల్దార్ కార్యాలయాల వరకు ప్రదర్శనగా వెళ్లి కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఉన్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చైతన్య, మండల డిప్యూటీ తహశీల్దార్ ఈడే శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు మాట్లాడుతూ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం తాత్సార్యం చేస్తోందన్నారు. ఆఫ్లైన్లో మిలుల్లకు తోలిన ధాన్యం ఇంతవరకు ఆన్లైన్ చేయలేదని, ధాన్యం తోలినవారికి ఇంతవరకు డబ్బు రాలేదని రైతులను ప్రభుత్వం ఆదుకో పోతే ఉద్యమం ఉధతం చేస్తామని హెచ్చరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు, ఉయ్యూరు మాజీ చైర్మన్లు పూర్ణ చంద్రరావు, ఖుద్దూస్, పార్టీ నాయకులు జయదేవ్, కాకాని శ్రీనివాసరావు, వేమూరు శ్రీనివాసరావు, పొలదుగు బాలాజీ, మాధవి, ప్రసాద్, పోతురెడ్డి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి : వర్ల

పమిడిముక్కల : ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వర్ల కుమార్‌రాజా కోరారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో పమిడిముక్కల ఈ సందర్భంగా వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.30 వేలు, కౌలురైతులకు రూ.50వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోటూరు వెంకటసుబ్బయ్య, కొల్లూరు బాబ్జి, నరేంద్ర, లక్ష్మీనారాయణ, ముత్తయ్య శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **మొవ్వ :** రైతుల నుంచి వడ్లు, మొక్కజొన్న పంట ఉత్పత్తులు కొనుగోలు చెయ్యాలని టిడిపి నేతలు తహశీల్దారు సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ కు మంగళవారం వినతిపత్రం అందించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేని పక్షంలో మండలంలో అన్నీ ఆర్బీకేలు ముట్టడిస్తామని నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రామలింగేశ్వరవు, ,తాతినేని చిన్నపూర్ణ , కాత్రగడ్డ శ్రీను ,తులసిదాస్ ,వేల్ల నరేశ్ ,భోగడి నాగేశ్వరావు , పి.ఆనంద్ లతోపాటు పలువురురైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం తపసిపూడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలిని రూ.600కు పెంచాలనీ, ఉపాధి పనులను 200 రోజులు చూపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం బడ్జెట్ కన్నా రూ.38 వేల కోట్లు తగ్గించిందన్నారు. ఇది ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీయటానికి చేస్తోందన్నారు. వ్యవసాయ కార్మిక


కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

సంఘం ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితంగా పార్లమెంటులో వామపక్షాల ఎంపీల ఒత్తిడితో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సాధించామన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని ఉపాధి కూలీలంతా ఐక్యంగా పోరాడి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో సమ్మర్ అలవెన్స్, టెంట్‌కు డబ్బులు,మంచినీళ్లు డబ్బులు, మేటుకు పారితోషికం, పలుగు పదునుకు డబ్బులు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇవన్నీ కోత విధించిందన్నారు. వీటన్నింటిని మళ్లీ పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. ఎఫ్ఎలకు కూడా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని కావాలని అడిగిన వారందరికీ పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజేష్, సిఐటియు జిల్లా కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పోలి నాయుడు,సిఐటియు మచిలీపట్నం కార్యదర్శి సిహెచ్.జయరావు తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం :** ఉపాధి కూలీలకు రోజు వేతనం రూ.600కు పెంచాలని, 200 రోజుల పని కల్పించాలని కోరుతూ మంగళవారం మాదల వారి గూడెం పంచాయతీ కార్యాలయంలో అధికారులకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఆ సంఘం నాయకులు కే.వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

12న పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ

గుడివాడ : ఈ నెల 12న జరిగే మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిభాయి పూలేల విగ్రహాల ఆవిష్కరణను విజయవంతం చేయాలని బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.మారేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు వేముల బేబిరాణి కోరారు. మంగళవారం స్థానిక సత్యనారాయణపురంలోని అంజనేయ ఫంక్షన్‌హాలులో బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుకొల్లు వెంకటమల్లేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షులు దారం నరసింహారావుల అధ్వర్యంలో కాంస్య విగ్రహాల అవిష్కరణ బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ గుడివాడలోని ముగ్గు బజార్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు, సావిత్రిభాయి విగ్రహాలను ఈ నెల 12న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం భారీ ర్యాలీ, అనతరం స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం సమీపంలో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యామిని దేవి, దొండపాటి కృష్ణ, తమ్మా రమేష్, యార్లగడ్డ గోవర్ధనరావు, సంభాని రంగారావు, సిహెచ్ సత్యనారాయణ, లోయ రాధాకృష్ణ, బోయిన సోమశేఖర్, మూడెడ్ల ఉమా, ఎం.రాణి, ఉక్కంటి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలు దానం

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన పొట్లూరి నరసింహారావు (91) మంగళవారం మృతి చెందారు. ఆయన రెండు నేత్రాలు వారి కుటుంబ సభ్యులు సహకారంతో గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో తాడిగడప ఎల్.వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వారికి అందజేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆదినారాయణ తెలిపారు. పొట్లూరి నరసింహారావు పొట్లూరి అచ్చయ్య ధర్మసత్రం ధర్మకర్తగా వున్నారు. యన కళ్ళజోడు లేకుండానే పేపర్ చదివేవారు. ఆయన మృతి చెందటంతో కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు.ఈ

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

స్పందన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కఠిన చర్యలు తప్పవోవని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ డిఆర్ఓ, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పందన, జగనన్నకు చెబుదాం, రీ సర్వే, వైఎస్ఆర్ జగనన్న గృహ నిర్మాణం-పేదలందరికీ ఇళ్లు, నాడు-నేడు, మీసేవ, వ్యవసాయం, ఉద్యానం, ఉపాధి హామీ తదితర అంశాలపై మండలాల వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. స్పందన అర్జీల నాణ్యమైన పరిష్కారానికి గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో పటిష్టంగా పనిచేయుటకు జిల్లా మండల డివిజన్ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేశారన్నారు. స్పందన అర్జీదారులకు సరైన సమాధానం ఇవ్వాలని లేకపోతే ఇకపై బాధ్యుల పైన క్రమశిక్షణ చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ లోగా వీఆర్వోలు,గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి నివేదికలు అందజేయాలన్నారు. పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులు నిర్ణయించిన కాల పరిమితి ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు,డిపిఓ నాగేశ్వర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి విజయభారతి, సర్వే భూ రికార్డుల ఏడి గోపాల్ ,డి ఎల్ డి వో సుబ్బారావు, డిటిడబ్ల్యు ఓ ఫణి దూర్జటి తదితర జిల్లా అధికారులు ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దారులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుక చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని సవిత సమాజం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి కోటి అన్నారు. మంగళవారం శ్రీసాయి నాయీ బ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని దేవరపల్లి కోటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రహ్మణ సేవ సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని దాతలు ముందుకు రావాలన్నారు. వేసవికాలంలో పాదచారులకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు మరిన్ని మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు వికృర్తి పోతురాజు, సభ్యులు దుర్గారావు, తేన్నేంటి వెంకట పానేశ్వరరావు, గుండెమండ రాఘవేంద్రరావు, రాముడు, కృష్ణ, మాతాజీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు

ప్రజాశక్తి-చల్లపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రతి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకముందే సకల సౌకర్యాలు కల్పించేందుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాను గ్రామ సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు ప్రత్యేక కృషితో ఈ జగనన్న కాలనీ ఏర్పడిందన్నారు. లబ్ధిదారులకు రోడ్లు, విద్యుత్ లైన్లు, విద్యుత్ కనెక్షన్లు, నీటి సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులకు విద్యుత్ సరఫరా కోసం కాలనీలో రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.33.25 లక్షలతో రెండు త్రి ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్లు, ఒక సింగిల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్, 15 కిలోమీటర్ల కండక్టర్, 90 విద్యుత్ స్తంభాలు ఏర్పాటయ్యాయన్నారు. అనంతరం 160 గృహాలకు విద్యుత్ సరఫరాను సర్పంచ్ కోటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.విద్యుత్ శాఖ ఈఈ రాంబోట్లు ఆధ్వర్యంలో డీఈఈ పులి శివ నాగేశ్వరరావు పర్యవేక్షణలో మండల విద్యుత్ శాఖ అధికారి, ఏఈఈ అరవింద్ లక్ష్మీపురం జగనన్న కాలనీలో శరవేగంగా పనులు చేయించి విద్యుత్ సరఫరా చేశారన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసి జగనన్న కాలనీకి వెలుగులు జోడించారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైన్ మెన్ పెద్దిరాజులు, జూనియర్ అసిస్టెంట్ బట్టు అనిత, ఎనర్జీ అసిస్టెంట్ మేడేపల్లి సుబ్బారావు, నాంచారయ్య, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



విజయవాడలో...



చందర్లపాడులో...

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని రాష్ట్ర పిలుపులో భాగంగా సీఐటియు అధ్వర్యంలో మంగళ వారం పటమట అచ్చయ్య గ్రంథాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నగర అధ్యక్షులు వి. బి. రాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్య రోజురోజుకీ తీవ్రతరం అవుతుందని ఒక ప్రక్క నిర్మాణం మెటీరియల్ ధరలు పెరిగి మరో ప్రక్క ఇసుకని అందుబాటులో ధరలు లేకుండా చేసి నిర్మాణం పని చేసుకోవడానికి అందుబాటులో లేకుండా పోయింది అన్నారు. ఇటువంటి కొన్ని పరిస్థితుల్లో భవన నిర్మాణ కార్మికులు పని లేక రోజువారి జీవితాలని పూట గడవడానికి కూడాతీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఇది చాలా దారుణమని ఆయన అన్నారు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ బోర్డు 30 లక్షల మందికి ఆసరాగా ఉన్నటువంటి సంక్షేమ బోర్డు సంఘాలతోగాని ,ఎవర్ని సంప్రదించకుండా వైసిపి ప్రభుత్వం ఏకపక్షంగా 1214 సర్క్యులర్ ఇచ్చి సంక్షేమ బోర్డుని నిలుపుదల చేసింది అన్నారు. సంక్షేమ బోర్డు భవన కార్మికుల యోగక్షేమల కోసం ఏర్పాటు చేసిందని సంక్షేమ బోర్డు ఎవరు సొత్తు కాదని కార్మికులు పోరాడి సంపాదించుకున్న వెల్ఫేర్ బోర్డు ని కార్మికులకి సంక్షేమ ఫలాలు అందించాలని సంక్షేమ పథకాలు మరిన్ని ఉపయోగములు తీసుకురావాలని 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు భవన నిర్మాణ కార్మికుడికి పెన్షన్ , ఉచిత గహాలు కట్టించి , ఈఎస్ఐ హాస్పిటల్ వసతి కల్పించాలని ప్రతి భవన కార్మికుడికి విద్యా వసతి పిల్లలకు అందించాలని అన్నారు., ఈ కార్యక్రమంలో నగర కమిటి సభ్యులు పి. రాజు పెయింటర్ నాయకులు ,సాంబయ్య కుమారు ,పొాలరాజు ,డేవిడ్ ,మారయ్య ,గిరి ,బుజ్జి రమేష్ వీరబాబు కిషోర్ బోసు నాగేంద్రం మోషే ,శేఖరు ,కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చందర్లపాడు: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చందర్లపాడు బస్టాండ్ సెంటర్ నందు ఆందోళన నిర్వహించారు. కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు సందిపోగులింగయ్య సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు చందర్లపాడు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు బిల్డింగ్ వర్కర్స్ అధ్యక్షులు తోట రామారావు, వేమన శివారెడ్డి, ఎస్.కె మౌలాలి, గంగబోయిన వెంకట సోమయ్య, ఎస్.కె అబ్దుల్, ఎస్.కె జాన్ సైదా, నంద్రు శీను,పెసరమెల్లి ప్రభాకర్ ప్రసాద్ కార్మికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి -నందిగామ :** కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నందిగామ గాంధీ సెంటర్లో భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చనమోలు సైదులు సంఘీభావం తెలియజేశారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పని చేయనీయకుండా సర్క్యులర్ నెంబర్. 12 14 విడుదల చేసిందని తెలిపారు. బోర్డు నిధులు జీవో 17 విడుదల చేసి వాడుకుంటున్నదని, వాటి వల్ల వేలాదిమంది కార్మికులు పథకాలు కోసం దరఖాస్తు చేసుకొని పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. వేలాదిమంది కార్మికులు సంక్షేమ బోర్డు లో పేర్లు నమోదు చేసుకొని గుర్తింపు కార్డులు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. నేను ఉన్న నేను విన్న నేను చూశాను అని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భవన నిర్మాణ కార్మికులు గోడు వినిపించడం లేదా హైకోర్టులో సైతం వాయిదాలు తీసుకుంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ పౌరులు సంక్షేమ సంఘం కన్వీనర్ సయ్యద్ కాసీం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నందిగామ మండల నాయకులు షేక్ హుస్సేన్, షేక్ జాఫర్, గొర్రెపాటి శ్రీను, వెంకటేశ్వర్లు యాకోబు, నరసింహారావు ,గోపి, చిన్నోడు కార్మికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మంగళవారం కొండపల్లి బ్యాంకు సెంటర్ నందు ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు కొండపల్లి యూనియన్ ప్రెసిడెంట్ ఆకుల నాగ మల్లేశ్వరరావు , వైస్ ప్రెసిడెంట్ నక్క ప్రసాద్, సెక్రటరీ ఆకారపు.రమేష్, ఉపాధ్యక్షులు బడిషా కోటేశ్వరరావు , షేక్ జానీ , మండలనేని బాలరాజు, నవులూరి వెంకటేశ్వరరావు , చల్లా స్వామి, ఇబ్రహీం పట్నం మండల ఉపాధ్యక్షులు బి కష్ణారాయులు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పని చేయనీయకుండా విడుదల చేసిన సర్క్యులర్ నెంబర్. 1214 ఉపసంహ రించుకోవాలన్నారు.



నందిగామలో...



ఇబ్రహీంపట్నంలో..



ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్లో 161 సచివాలయం పరిధిలో పిళ్ళ అన్నపూర్ణమ్మ చనిపోవడంతో ప్రభుత్వం నుంచి వారికి మట్టి ఖర్చులను పదివేల రూపాయలను కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ చేతుల మీదగా మంగళవారం వారి కుమారుడు పిళ్ళ వినయ్‌కి అందచేశారు. కుటుంబ వివరాలు అడిగి తెలుసుకొని త్వరలోనే భీమా కూడా అందేలా చూస్తానని కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పక్కుర్థి రామకష్ణ, బాయన బెనర్జీ, సచివాలయం సెక్రెటరీ ఆంజనేయులు పాల్గొన్నారు.

రుద్రవరంలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి -నందిగామ : వైసిపి నాలుగేళ్ల పరిపాలనలో ప్రజల సమస్యల పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య విమర్శించారు. మంగళవారం నందిగామ మండలం రుద్రవరం గ్రామాల్లో రాష్ట్రానికి ఇదేం కర్మ అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ వైసీపీ నాలుగేళ్ల పాలన అభివద్ధి పూర్తిగా కొంటుపడిందన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా వైసీపీ కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు , చెరుకూరు రామారావు, మండవ శ్రీనివాసరావు వేల్పులు బిక్షాలు తదితరులు పాల్గొన్నారు.


లూపస్ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులువు

- ఈ వ్యాధికి పూర్తిస్థాయి నివారణ లేదు
- ముందుగా గుర్తిస్తే నష్టాన్ని తగ్గించుకోవచ్చు
- ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ సున్నా కావ్యా దేవి
- నేడు వరల్డ్ లూపస్ డే

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : లూపస్ అనేది ఒక ఆటో ఇమ్యున్ వ్యాధి. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా మే 10వ తేదీని వరల్డ్ లూపస్ డే గా పరిగణిస్తారు. దీని ముఖ్య ఉద్దేశం ప్రజలకు లూపస్ వ్యాధి గురించి అవగాహన పెంచడం మరియు లూపస్ వ్యాధిగ్రస్తులకు చేయూతనివ్వడం ప్రధాన ఉద్దేశమని ప్రముఖ రుమటాలజిస్ట్, అన్విత ఆర్థరైటిస్ అండ్ రుమటాలజి సెంటర్ వైద్యులు డాక్టర్ సున్నా కావ్యా దేవి తెలిపారు.

ఆటో ఇమ్యూన్ వ్యాధి అంటే ఏమిటి?

సహజంగా మన శరీరాన్ని సూక్ష్మ క్రిముల బారి నుండి తప్పించడానికి రోదనిరోధక వ్యవస్థ తోడ్పడుతుంది.కొందరిలో ఈ రోగ నిరోధక వ్యవస్థ గాడి తప్పి అంతర్గత కణజాలానికి బాహిర్గత కణజాలానికి మధ్య తేడాను గుర్తించలేక విపరీతంగా స్పందిస్తుంది. దీనివలన ఆటోయాంటీ బాడీస్ అధికంగా ఉత్పత్తి అయి మన శరీరంలో ఉన్న వివిధ అవయవాల మీద దాడి చేసి వాటిని విచ్ఛిన్నం చేస్తాయి. ఇలా మన స్వీయ రోగ నిరోధక శక్తి మన మీదే దాడి చేయడం వల్ల తలెత్తే జబ్బులను ఆటో ఇమ్యూన్ వ్యాధులు అంటారు. వందరకాలకు పైగా ఉన్న ఈ వ్యాధులు సాధారణంగా ఒక భాగం పైనే ప్రభావం చూపిస్తాయి. కానీ లూపస్ వ్యాధి మన శరీరంలో ఉన్న ప్రతి అవయవం మీద ప్రభావం చూపుతుంది.



లూపస్ ఎవరిలో వస్తుంది?

లూపస్ వ్యాధిగ్రస్తుల్లో 100 కి 90 మంది మహిళలే ఉన్నారు. యుక్త వయసులో ఉన్న ఆడవారికి (15-45) ఎక్కువగా వస్తుంది. చిన్న వయసులో కానీ మగవారికి కానీ సంభవించినప్పుడు దాని ప్రభావం అధికంగా ఉంటుంది.

లూపస్ రావడానికి కారణాలు?

ఈ వ్యాధి రావడానికి ఖచ్చితమైన కారణాలు లేవు. రోగ నిరోధక వ్యవస్థ గాడి తప్పడానికి జన్యుపరమైన లోపాలు, స్త్రీ హార్మోన్ల అసమతుల్యత, వివిధ పర్యావరణ మార్పులు, ఇన్ఫెక్షన్స్ కారణం కావచ్చు అని భావిస్తున్నారు.

లూపస్ వ్యాధి లక్షణాలు ఏమిటి?

ఈ వ్యాధి లక్షణాలు వివిధ రకాలుగా ఉంటాయి. ఏ క్షణంలో అయినా ఏ అవయవం మీద అయినా ప్రభావం చూపుతుంది. సాధారణంగా మొహం మీద సీతాకోకచిలుక ఆకారంలో ఎర్రగా మచ్చలు వచ్చి మాంసం తింటున్న తోడేలు మాదిరిగా కనపడుతుంది. ఎండకు వెళ్ళినప్పుడు చర్మం ఎర్రగా కంది దురద మంట రావడం జరుగుతుంది. జుట్టు ఎక్కువగా రాలుతుంది. తరచుగా నోట్లో అంగిలి మీద పుండ్లు పడతాయి. కారణాలు లేకుండా జ్వరం రావడం, విపరీతమైన నీరసం నిస్సత్తువ, బరువు తగ్గడం, కీళ్ల నొప్పులు, తలనొప్పి, చిన్న వయసులో ఫిట్స్ మరియు పక్షవాతం రావడం, మానసిక సమస్యలు రావడం, రక్త కణాలు తగ్గడం, మూత్రం నుంచి ప్రోటీన్లు పోవడం, గుండె ఊపిరితిత్తుల పనితీరు తగ్గి దగ్గు ఆయాసం కాళ్లవాపులు రావడం, కడుపులో నొప్పి, వాంతులు విరోచనాలు అవ్వడం దీని ఇతర లక్షణాలు.



లూపస్ వ్యాధిని నిర్ధారించడం ఎలా?

లూపస్ తొలి దశలో ఉన్నప్పుడు లక్షణాలు తక్కువ తీవ్రతతో వస్తూ పోతూ ఉంటాయి. అందువల్ల చాలామంది ఈ లక్షణాలు ఇన్ఫెక్షన్స్ వల్ల కానీ, పౌష్టికాహారం లోపం వలన కానీ, ఒత్తిడి వలన కాలనీ వస్తున్నాయి అని భావిస్తారు. దీంతో లూపస్ ని గుర్తించడం ఆలస్యం అయ్యి లో లోపల కీలక అవయవాలు దెబ్బతింటాయి. కావున ఈ జబ్బును తొలి దశలో గుర్తించడం చాలా ముఖ్యం. అందువలన పైన తెలిపిన లక్షణాలు యుక్తవయసులో ఉన్న ఆడవారికి వచ్చినట్లయితే వెంటనే రుమటాలజిస్ట్ ని సంప్రదించి ఏఎన్ఏ,డి ఎస్డిఎన్ఎ టెస్ట ద్వారా వ్యాధిని నిర్ధారించుకోవాలి.

లూపస్ వ్యాధికి వైద్యం ఎలా ఉంటుంది?

లూపస్ వ్యాది .గ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలి. దీనికి వాడే మందులు అతిగా ప్రేరేపించబడిన రోదనిరోధక వ్యవస్థని అదుపులోకి తెస్తాయి. స్థిరాయిడ్ మందులతోపాటు ఇమినో మోడ్యులేటర్ మందులు కూడా వాడాల్సి వస్తుంది. చాలామంది మందుల దుష్ప్రభావాల కు భయపడి హఠాత్తుగా మందులు హఠాత్తు ఆపేసి ఇతర చికిత్సలు తీసుకుంటారు దీనివలన వ్యాధి తీవ్రత పెరగడమే కాకుండా ఇన్ఫెక్షన్స్ కూడా వస్తాయి. ప్రతి మందు తగిన మోతాదులో తగిన సమయంలో జబ్బు తీవ్రతను బట్టి తగినంత కాలము అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో తీసుకున్నట్లయితే లూపస్ వ్యాధిని నియంత్రించడంతో పాటు ఈ మందుల వలన వచ్చే దుష్ప్రభావాలను తగ్గించవచ్చు. వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడిన వారు తోటి వారి లాగానే సాధారణ జీవితం హాయిగా గడపవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ....

- సూర్యరశ్మి సోకకుండా చూసుకోవాలి.
- ఎండకు వెళ్ళినప్పుడు సన్ స్క్రీన్ లోషన్స్, లేత రంగు దుస్తులు, గొడుగు, స్కార్ఫ్ తప్పనిసరిగా వాడాలి.
- ధూమపానానికి మద్యపానానికి దూరంగా ఉండాలి.
- శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఒత్తిడికి దూరంగా ఉండాలి. తగినంత సమయం విశ్రాంతి తీసుకోవాలి.
- ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి.
- ఇన్ఫెక్షన్స్ వచ్చినప్పుడు మరియు గర్భం ధరించినప్పుడు వైద్యుల సలహా లేనిదే మందులు ఆపరాదు.
- ఇన్ఫెక్షన్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అనగా మంచి పౌష్టికాహారం, తప్పనిసరిగా మాస్కు మరియు వ్యాక్సిన్స్ తీసుకోవాలి.

నేనిచ్చే సందేశం...

- లూపస్ వ్యాధికి పూర్తిస్థాయి నివారణ ఉండదు కనుక దీనిని మనము తొలి దశలో గుర్తించి సరైన చికిత్స తీసుకొన్నచో దాని వలన సంభవించే నష్టాన్ని మరియు మరణాన్ని తగ్గించుకోవచ్చు.
- అందుకనే ఈ వ్యాధి గురించి ప్రతి ఒక్క పౌరునికి అవగాహన ఉండాలి.
- లూపస్ వ్యాధిగ్రస్తులకు సమాజం నుండి కుటుంబ సభ్యుల నుండి సరైన సహాయ సహకారాలు మరియు ప్రోత్సాహము లభించాలి.

ఘనంగా గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం

27 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

స్థానిక ఏ ఏ ఎన్ ఎం అండ్ వి వి ఆర్ ఎస్ ఆర్ పాలిటెక్నిక్ కళాశాల 42వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఎస్‌బిటిఇటి విజయవాడ సెక్రటరీ కె.వి.రమణ బాబు ముఖ్య



అతిథులను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

అతిథిగానూ, పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థి, ప్రస్తుత సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ఎంఎస్ఐ (హైదరాబాద్) శ్రీధర్ దేవినేని హాజరయ్యారు. తొలుత కార్యక్రమాన్ని ముఖ్య అతిథి, గౌరవ అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు వల్లూరుపల్లి అధ్యక్షత వహించారు. ఆయన అధ్యక్షోపన్యాసంలో కళాశాల నిర్మాణ ఆశయాలు, లక్ష్యాలను పాలిటెక్నిక్ చేరుకుందన్నారు. పాలిటెక్నిక్ పురోగాభివృధి పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ జి.వి.వి. సత్యనారాయణ రిపోర్ట్‌లో పాలిటెక్నిక్ గత మూడు సవంత్సరాలలో జిల్లాస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు సాధించిన విజయాలు, వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్న విజయాలు వివరించారు. శ్రీధర్ దేవినేని మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా వారి నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకోవాలన్నారు. నూతన సాంకేతికత, మార్పులను గమనించి వారి భవిష్యత్తు ప్రణాళికను భావ వ్యక్తీకరణ, టీమ్ వర్క్, విశ్లేషణాత్మక నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలు, నాయకత్వ లక్షణాలను 21 శతాబ్దంలో విద్యార్థులకు అత్యంత అవసమైన నైపుణాలుగా పేర్కొన్నారు. తాను పాలిటెక్నిక్ చదివిన రోజులను గుర్తుచేసుకొంటూ పాలిటెక్నిక్ ఎంతో పురోభివృధి సాధించిందన్నారు. విద్యార్థులకు అవసమైన అన్ని వసతులను యాజమాన్యం వారు సమకూర్చారని కొనియాడారు. కె.వి.రమణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యలో బెస్ట్ స్టూడెంట్స్‌ని ప్రకటిస్తే 90 శాతం విద్యార్థులు గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులే ఉంటారన్నారు. విజయాలకు పుట్టినిల్లు గుడ్లవల్లేరు అని దీనికి కారణం ఇక్కడి అడ్మినిస్ట్రేషన్, యాజమాన్యం కృషే కారణమని కొనియాడారు. ఇక్కడున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలిగితే, అసాధ్యాలను అద్భుతాలు చేయొచ్చునన్నారు. విద్యార్థులు డిప్లొమా అయిన తరువాత ఉద్యోగాలపై దృష్టి పెడితే మంచి అనుభవంతో పాటు, ఆదాయం కూడా గడించి దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడొచ్చునన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లొచ్చని సలహా ఇచ్చారు.

27 మందికి బంగారు పతకాలు

అనంతరం గత మూడు సంవత్సరాలలో ఉత్తీర్ణులైన వారిలో బ్రాంచ్‌లలో టాపర్స్ 27 మందికి బంగారు పతకాలను అందచేశారు. గత మూడు సంవత్సరాల్లో ఈసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన 153 మందికి నగదు పారితోషకాలతో ప్రోత్సహించారు. 2020-23లో పాలిటెక్నిక్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ పాలిటెక్నిక్ టాపర్‌గా నిలిచిన ఎస్.సాయి పవన్ ఆదిత్య, బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా, వివిధ స్థాయిల ఆటల పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన జె.బదుని పాలిటెక్నిక్ క్రీడా కారుడిగా గుర్తించి జ్ఞాపికను ముఖ్య అతిథుల చేతులు మీదుగా అందజేశారు. ద్వితీయ, తృతీయ సంత్సరాల్లో టాపర్స్ గా నిలిచిన వారికి రూ. 37వేలు విలువగల పుస్తకాలను బహుకరించారు. చివరిగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఆటాపాటలతో అలరించారు. యాజమాన్య సభ్యులు, చైర్మన్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎస్.ఎన్.ఆర్.వి ప్రసాద్, ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్స్, డైరెక్టర్స్, డీన్స్, మెంటార్స్, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. లక్ష్మణరావు ఎ.ఎ.ఎస్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్ ఎన్.శ్రీనివాసమూర్తి, పాలిటెక్నిక్ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



ఆలోచింపచేసిన జాతీయస్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి-గుడివాడ

కృష్ణా ఆర్ట్స్ ఆండ్ కల్చరల్ అసోసియేషన్, కళాపరిషత్‌ల ఆధ్వర్యంలో నిర్వహింస్తున్న జాతీయస్థాయి నాటిక పోటీలకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సోమవారం రాత్రి స్థానిక ఎస్‌పిఎస్ ఉన్నత పాఠశాలలోని కఠారి సత్యనారాయణ కళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

నాటిక పోటీల్లో 2వ రోజున ప్రదర్శించిన 4 నాటికలు ఆద్యంతం ప్రేక్షకులను రంజింపచేశాయి. మొదటగా గంగోత్రి, పెదకాకాని ప్రదర్శించిన ఆస్తికలు బ్రతికినంత కాలం ఆస్తులు పోగేసుకోవడమే లక్ష్యంగా బ్రతికిన వ్యక్తికి చచ్చి దెయ్యమయ్యాక గానీ తన జీవితం ఎంత నికృష్టమైందో అర్థం అవడం, 2వ ప్రదర్శనగా హర్ష క్రియేషన్స్, స్వర్ణకమలాలు నాటిక 'భార్య పట్ల కూడా ఈర్శ్య అసూయ ద్వేషాలకు అతీతం కాదని, రచయిత్రిగా భార్యకు పేరుప్రతిష్టలు వస్తే, భర్త ఈర్ష్య పడే నేపథ్యంలో సాగింది. 3వ ప్రదర్శన అభినయ ఆర్ట్స్ అతీతం నాటికలు ఇప్పటి ప్రస్తుత స్పీడ్ యుగంలో ఆస్తుల డబ్బు సంపాదనల మోజులో ఎవరికోసం ఎందుకోసం సంపాదిస్తున్నాం అన్నది కూడా మరచి డబ్బు వెంట పరిగెడుతూ, ప్రపంచీకరణ పేరుతో హ్యాపిగా వున్నామనే భ్రమలో వుండి కుటుంబ సభ్యులకు దూరమవుతున్న మానవ సంబంధాల ఇతివృత్తంతో నాటిక సాగింది. ప్రత్యేక ప్రదర్శనగా పోటీల నిర్వహణ సంస్థ కృష్ణా ఆర్ట్స్ సభ్యులు ప్రదర్శించిన పితృదేవోభవ నాటిక ప్రేక్షకులను కంట తడి పెట్టించింది. ఆర్థిక సమస్యల నేపథ్యంలో వృద్ధాప్యంలో వున్న తండ్రిని కాశీలో వదలివేసి తన తండ్రి కాశిలో చనిపోయాడని బంధుమిత్రులకు చెప్పిన కొడుకు, కొడుకే కాశీలో తప్పిపోయాడనే భ్రమలో తండ్రి, ఆఖరికి తండ్రి కొడుకు దగ్గరికి చేరుకోవటం, కొడుకు, కోడలు, మనుమడు పశ్చాత్తాపపడి తండ్రిని అక్కున చేర్చుకోవటంతో నాటిక సుఖాంతమవుతుంది. ఆయా నాటికల్లో నటీనటులు అత్యంత అద్భుతంగా నటించి రక్తి కట్టించారు. ఈ కార్యక్రమాల్లో కృష్ణా ఆర్ట్స్ అధ్యక్షులు పి.వి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ప్రసాద్, డి.చంద్రశేఖర్, ఆర్‌విఎల్ నరసింహారావు, నరహరశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ కిట్లు అందజేత

ఉయ్యూరు : క్రీడల పట్ల యువత ఆసక్తి పెంపొందిచుకుని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగి పేరు ప్రఖ్యాతులు గడించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కోరారు. ఉయ్యూరుకు చెందిన యువకులు కె.గణేశరావు, జి.సోను భార్గవ్ ఇటీవల జిల్లా, రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరచి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. వారిని ప్రోత్సహిస్తూ బాక్సింగ్ కిట్లను సారథి మంగళవారం అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించాలని అందుకు తన సహాయ సహకారాలుంటాయన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

గన్నవరం : పర్యావరణంపై ప్రజల్లో అవగాహనా పెంచేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో గన్నవరం మండలంలోని చిక్కవరం గ్రామంలో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించిన్నట్లు మచిలీపట్నం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి.లెనిన్ కుమార్ తెలిపారు. లెనిన్ కుమార్ మాట్లాడుతూ చెట్లను నరకడం, నీళ్లను వథా చేయడం, ప్లాస్టిక్‌ని అధికంగా వాడడంతో వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటోందన్నారు. అవసరానికి మించి వాడుతున్న వాహనాల కారణంగా వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోతోందన్నారు. కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని, చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలుతో ఎన్నో పౌష్టిక లాభాలు ఉన్నాయన్నారు. మచిలీపట్నం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం.శీనివాసరావు,చిక్కవరం గ్రామ పంచాయతీ సెకరటరీ రాజేష్ పాల్గొన్నారు.

రూ.69 లక్షలతో పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు

రూ.69 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపిపి వి.సరోజిని, ఎంపిడిఒ కెఎస్‌వి శేషగిరి కోరారు. ఉంగుటూరు మండల



ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి పనులు, ప్రగతి పై సభ్యులు సమీక్షించి, గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో అంతర్గత రోడ్లు , బోర్ నిర్మాణం, కల్వర్టు, ఇతర మౌలిక సదుపాయాలు అభివృద్ధి పనులకు మండల పరిషత్ నిధులు ద్వారా రూ.69.4 లక్షలు అంచనా విలువ పనులు ఆమోదించారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనలు స్వీకరించేందుకు బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటలవరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కేఎస్ఆర్కే ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెల్ : 995922796కు ఫోన్ చేసి ప్రయాణికులు సలహాలు, సూచనలు తెలియజేయాల్సిందిగా కోరారు.



సుబ్బారావును సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు, ప్రముఖులు

సందడిగా వికెఆర్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గన్నవరం

అందరూ 60 ఏళ్ల పైబడి వయసు కలిగిన వారే..అయినా ఆప్యాయత పలకరింపులు.. నాటి తీపి జ్ఞాపకాల నెమరు వేతలు.. జోకులతో కేరింతలు..జీవితంలో సాధించిన విజయాలను పంచుకుని.. స్నేహమేరా జీవితమని చెబుతూ ఉత్సాహంగా.. ఉల్లాసంగా మంగళవారం గన్నవరం మండలం కేసరపల్లి ఎయిర్ పోర్ట్ ఎదురుగా ఉన్న వికేఆర్ కళాశాలలో 1974 నాటి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం టిఎస్ ఆర్ కె. ప్రసాద్ ఆధ్వర్యంలో సాగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి అప్పటి విద్యార్థులు ఒకే చోట కలిసి పండుగ వాతావరణాన్ని మైమరపించేలా సందడి చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి టిఎస్ఆర్కే ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. కళాశాలలో చదువుకోవడం, వ్యాయామ ఉపాధ్యాయులుగా ప్రభుత్వ స్కూళ్లలో, కాలేజీలో పని చేయడం వల్ల కలిగిన ప్రయోజనాలు తెలిపారు. వికెఆర్ కళాశాలలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యఅతిథిగా కళాశాల యాజమాన్య కమిటీ కోశాధికారి గూడవల్లి రాధా సుబ్బారావు మాట్లాడుతూ గన్నవరంలో 4.40 ఎకరాలు దానంగా ఇచ్చి జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల వేములపల్లి లక్ష్మీ అన్నపూర్ణమ్మ పేరుతో ఏర్పాటు చేయించామని గుర్తుచేశారు. ఆ తర్వాత ఈ ప్రాంతంలో కాలేజీ లేదని, పెడితే బాగుంటుందని భావించి వేములపల్లి కోదండ రామయ్యకు చెప్పి బుద్ధవరంలో వీకేఆర్ కాలేజీ పెట్టించామని తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, సామాజికవేత్త వేములపల్లి కోదండ రామయ్యతో కలసి పని చేయడం అదృష్టంగా చెప్పారు. వి.కే.ఆర్ కళాశాల కరెస్పాండెంట్ పి.వి.రత్న ప్రసాద్ మాట్లాడుతూ కాలేజీకి మళ్ళీ పూర్వ వైభవం వస్తోందన్నారు. ఆధునిక వసతులతో కళాశాల భవన సముదాయం నిర్మాణం జరిగిందని, పూర్వ విద్యార్థులు కాలేజీ అభివృద్ధికి కషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం రాధా సుబ్బారావు, రత్న ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి అధ్యాపకులు గన్నె వెంకట్రావు, డి.సీతారామస్వామి, రాంప్రసాద్, వి కే ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రిటైర్డ్ అధ్యాపకులు సీతారామస్వామి పాటలు, పద్యాలతో అందరినీ అలరించారు.

మున్సిపల్ కార్మికుడు ఏసు కుటుంబాన్ని ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర నేత బాబురావు డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : ఈనె 8న విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదంలో మతి చెందిన మున్సిపల్ కార్మికుడు తాడిశెట్టి ఏసుదాసు మతదేహాన్ని మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు సందర్శించారు. విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న ఏసుదాసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను, కార్మికులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన యేసు కుటుంబానికి రూ.25 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి మున్సిపల్ కార్మికులు పనిచేస్తున్నారని, కరోనా సమయంలో పలువురు మత్యువాత పడ్డారని, పారిశుధ్య నిర్వహణలో ఉన్న కార్మికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తుచేశూరు. భూగర్భ డ్రైనేజీలో మ్యాన్ హెూల్స్ లో పడి పలువురు మత్యువాత పడ్డారని, వాహనాల పైన పనిచేసే వారు మరణించారని, పలువురు తీవ్రంగా గాయపడి అంగవైకల్యం గురయ్యారని, కొందరు మంచాన పడ్డారని, పని చేయలేని పరిస్థితిలోకి నెట్టబడ్డారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల విధి నిర్వహణలో ప్రమాదాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, ఈనేపథ్యంలో వారికి తగు రక్షణ కల్పించాలని, కార్మికుల ప్రాణాలను కాపాడాలని అన్నారు. కార్మికుల రక్షణ, ప్రమాద బీమాపై నగరపాలక సంస్థ స్పందన తగిన విధంగా లేకపోవడం బాధాకరం పేర్కొన్నారు. ఏసు కుటుంబంలో నిబంధనల ప్రకారం ఒకరికి ఉద్యోగం, చట్టబద్ధంగా రావలసిన ఇతర పరిహారాలు చెల్లించాలని, రూ.25 లక్షలు నష్టపరిహారం నగరపాలక సంస్థ ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ యూనియన్(సిఐటీయూ) అధ్యక్షులు ఎస్.జ్యోతిబాసు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై పీడీ యాక్ట్ అమలు

ప్రజాశక్తి - విజయవాడ

గంజాయి అమ్ముతూ నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగించడానికి కారణమవుతున్న ఇద్దరు గంజాయి విక్రయదారులపై పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. నగరంలోని అజిత్ సింగ్‌నగర్, నున్న పోలీస్ స్టేషన్ల పరిధిలోని బొంతుల దుర్గారావు అలియాస్ గొంతులు, మున్నంగి సురేష్ ప్రజా శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తున్నందున వీరిద్దరిపై పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఎన్‌టిఆర్ జిల్లా నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ఆదేశాలు జారీ చేశారు. దుర్గారావు 12 కేసుల్లో, మున్నంగి సురేష్ 10 కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్నారు. వీరు పలుమార్లు గంజాయి విక్రయ కేసుల్లో పట్టుబడి అరెస్టయిన తర్వాత కూడా నేర ప్రవత్తిని మార్చుకోకుండా గంజాయిని విక్రయిస్తూ నగరంలోని ప్రజలను మత్తు పదార్థాలకు బానిసలుగా చేయడానికి ప్రయత్నిస్తూ నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగ జేస్తున్నారు.

విద్యుత్ అదనపు చార్జీలను రద్దు చేయాలి : సిపిఎం



ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న ట్రూ అప్, ఇందన విద్యుత్ కొనుగోలు ఖర్చు అదనపు చార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలపై వేస్తున్నభారాలకు వ్యతిరేకంగా సిపిఎం మచిలీపట్నం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నం 46వ డివిజన్ నారాయణపురంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలపై నిత్యవసర సరుకులు పేరుతో, డీజిల్ పెట్రోల్, గ్యాస్ ధరలతో సతమవుతమవుతున్న ప్రజానీకానికి మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, విద్యుత్ కొనుగోలు ఖర్చు పేరుతో వేలకోట్ల రూపాయలు భారలు వేస్తూ ముక్కు పిండి వసూలు చేస్తోందని విమర్శించారు. విద్యుత్ పై వేస్తున్న అదనపు భారలను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్, సిఐటియు నాయకులు టి చంద్రపాల్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎండి యూనస్, పి లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాజీ బాబు, ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ విజయలక్ష్మి, కే సుజాత, బి భవాని, డి సత్యనారాయణ ఈడే రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 1902కు కాల్ చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసి ప్రభుత్వ సేవలు పొందగలిగే విధంగా జగనన్నకు చెబుదాం అనే సరికొత్త కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి ఎలాంటి సమస్య పరిష్కారానికైనా 1902 కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్నకు చెబుదాం అనే సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగుపరచి ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసి ప్రభుత్వ సేవలు పొందగలిగే విధంగా చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి కలెక్టరేట్ నుండి వీడియోకాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమాన్ని ఆధునీకరించి ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసే విధంగా మెరుగైన విధానం అమల్లోకి తెచ్చేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెం. 1902కి కాల్ చేసి ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి. జాషువా, ఏఎస్పీ రామాంజనేయులు, జిల్లాపరిషత్ ఉపాధ్యక్షురాలు గరికపాటి శ్రీదేవి, డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, కెఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివ నారాయణ రెడ్డి, డిఎల్ ఓ సుబ్బారావు, డిఆర్డిఎ పీడీ పిఎస్ఆర్ .ప్రసాద్, డీపీఓ నాగేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక పర్యవేక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి, సంక్షేమ పథకాలపై మండల ప్రత్యేకాధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ, మండలాల ప్రత్యేకాధికారులుగా వివిధ శాఖల హెచ్ఓడీలను నియమించామన్నారు. వారు వారంలో ఒకటి లేదా రెండు గ్రామాల్లో పర్యటించాలన్నారు. ముఖ్యంగా స్పందనలో తిరస్కరించిన అర్జీలు రీ- ఓపెన్ అవుతున్నాయని, అందుకోసం సంబంధిత సచివాలయాన్ని సందర్శించి కారణాలను విశ్లేషించాలన్నారు.

మహాయజ్ఞం ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈనెల 12 నుండి 17వ తేదీ వరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం పురస్కరించుకుని చేస్తున్న భద్రత ఏర్పాట్లను మంగళవారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తో కలిసి నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా పరిశీలించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న బందోబస్త్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఆరు రోజులపాటు స్టేడియంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మహా యజ్ఞ కార్యక్రమం జరుగనుందన్నారు.



విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో మంగళవారం విద్యార్థులచే కథలు చదివించడం, చెప్పించడడం చేశారు. అనంతరం రిసోర్స్ పర్సన్ చే తెలుగు పద్యాలు, శ్లోకాలు, సెస్ బేసిక్స్, బేసిక్ మేథమెటిక్స్, పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్, రిసోర్స్ పర్సన్ కె. విజయ లక్ష్మి, బి. వినోద్, ఆర్ శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ కె.కె ప్రణీత పాల్గొన్నారు.



కంచికచర్లలో....

ప్రజాశక్తి - కంచికచర్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 2వ రోజు కంచికచర్ల జడ్‌పిహెచ్‌సి స్కూల్ తెలుగు మాస్టర్ యెస్.కె ఇస్మాయిల్ విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పారు. అనంతరం విద్యార్థులు పాటలు పాడడం, డాన్స్ చేయడం, చెస్ ఆడడం, క్యారమ్ బోర్డ్ ఆడడం చేశారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ.రామచంద్రుడు, కవి,డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వర రావు, వివేక్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి



చింతలమడ ప్రమాద బాధితులకు రూ.23.50 లక్షలు పంపిణీ

బాధితులకు ముఖ్యమంత్రి సహాయం అందించడంతోపాటు అందుకు కృషిచేసిన శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబుకు సిపిఎం చల్లపల్లి మండల కార్యదర్శి యద్దనపూడి మధు కృతజ్ఞతలు తెలిపారు. బాధితులంతా నిరుపేదలే కాక గాయపడ్డవారు ఎటువంటి పని చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నందున వారికి పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు చెక్కులను అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ తాము ఆందోళన నిర్వహించామని గుర్తుచేశారు. ఎంఎల్ఎ సింహాద్రికి వినతిపత్రం అందజేయడంతోపాటు బాధితులతో కలిసి కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఎంఎల్సి కె.ఎస్.లక్ష్మణరావు దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరీముల్లా, బండారు కోటేశ్వరరావు, పల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ప్రమేయం లేదు

వద్ద విచారణలో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డిసిపి విశాల్‌గున్ని పాల్గొన్నారు.

ఘర్షణలో వ్యక్తి మృతి

విజయవాడ అర్బన్ : పెనమలూరు మండలం కానూరు సమీపంలో ఆటో డ్రైవర్ హత్యకు గురైన ఘటన సోమవారం అర్ధరాత్రి వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం...మండలంలోని తాడిగడప వసంత నగర్‌లో నివసించే ఆటో డ్రైవర్ చెన్నూరి అజయ్ సాయి ఈ ఘటనలో హత్యకు గురయ్యాడు. చెన్నూరి అజయ్ సాయి తన స్నేహితులు వాణి శ్రీధర్, సాయి నాగార్జున, ప్రశాంతంతో కలిసి సోమవారం రాత్రి విజయవాడ రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద కలిశారు. అక్కడ వారు మాట్లాడుకుంటుండగా, అక్కడికి వచ్చిన స్వామి అనే యువకుడు వచ్చాడు. అక్కడి కొద్దిసేపు మాట్లాడుకున్న తర్వాత స్వామి ఇయర్ బర్డ్స్ కనిపించలేదు. దీంతో వాటిని అజయ్ సాయి దొంగలించాడని అనుమానించిన నలుగురు స్నేహితులు అతనితో వాగ్వాదానికి దిగారు. ఈ వివాదం ముదిరి వారి మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో సాయిపై మిగిలిన నలుగురు స్నేహితులు దాడి చేయడంతో స్పృహ కోల్పోయాడు. దీంతో ఆందోళన చెందిన స్నేహితులు వెంటనే అతనిని పటమటలోని ఓ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సాయి మరణించాడని తెలియడంతో నలుగురు స్నేహితులు పరారయ్యారు. ఈ ఘటనపై మతుని తండ్రి గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఘర్షణ జరిగిన ప్రాంతం పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగా, మరణించిన ప్రాంతం పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చింది. దీంతో ఎవరు కేసు కట్టాలనే విషయమై అర్ధరాత్రి వరకు పోలీసులు తాత్సారం చేశారు.

'విజేత' విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

వసతులను అభివృద్ధి చేయడంతోపాటు అత్యుత్తమ ఉపాధ్యాయులతో డిజిటల్ విద్య బోధన అందిస్తోందన్నారు. ఉన్నత విద్యలో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యార్థులతోపాటు విజేత విద్యా సంస్థల క్యాంపస్ ఇన్చార్జి ఆర్.బ్రహ్మారెడ్డి ఉన్నారు.

అభివృద్ధి అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న మోకా వెంకటేశ్వరమ్మ

కౌన్సిల్లో ఏకపక్ష నిర్ణయాలపై టిడిపి కౌన్సిలర్ల నిరసన

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మచిలీపట్నం నగర పాలక సంస్థ అత్యవసర సమావేశం మంగళవారం నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎజెండాలో 9, టేబుల్ ఎజెండాలో 2 తీర్మానాలు



ఏకగ్రీవంగా ఆమోదించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 46వ సచివాలయం ఏరియాలో యర్రా నాగేశ్వరరావు మున్సిపల్ పార్క్ అభివద్ధికి రూ 10 లక్షలు (పార్ట్ బిల్) ఏపి గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషనుకు కేటాయించిన అంశం కౌన్సిల్లో తీర్మానం జరిగింది. స్థానిక 7 వ డివిజనులో జంక్షన్ ఉన్న ప్రాంతంలో రోడ్డు వెడల్పు, డ్రైనేజీ నిర్మించుటకు రూ 4.41, 33 వ డివిజన్ పరిధిలో మసీద్ ఇ ఇమామ్ ఇ జమాన బరీయల్ గ్రౌండుకు దక్షిణం నుండి పడమర వైపు కాంపౌండ్ వాల్ నిర్మాణం పనికి మేయర్ తీసుకున్న ముందస్తు చర్యలను ఆమోదించారు. నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లు, మూడు రెవెన్యూ సర్కిల్స్ లో రోడ్డు వెడల్పు చేసే సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న డబుల్ అసెస్మెంట్లు 134, నాన్ ట్రేస్డ్ 1150, రోడ్ ఎంక్రోచ్మెంట్స్ 132 మొత్తం 1416 అసెస్మెంట్లు తొలగించటాన్ని కౌన్సిల్ ఆమోదించింది. 33వ డివిజన్లో ఇ ఇమామ్ ఇ పంజా ప్రాంతంలో ఉన్నటువంటి శ్మశాన వాటికకు లైటింగ్ ఏర్పాటుకు రూ 4,96,500 నిధులు మంజూరుకు కౌన్సిల్ తీర్మానించింది. సైనికులు, మాజీ సైనిక ఉద్యోగులు నివాసముంటున్న ఇంటి పన్ను మినహాయింపులో అర్హత ఉన్నవారికి అర్జి తేదీ నుండి ఆస్తి పన్ను మినహాయింపు ఇస్తూ కౌన్సిల్ ఆమోదించింది. నగర పాలక సంస్థలోని వివిధ విభాగాల సాధారణ ఖర్చులలో భాగంగా జనరల్ అడ్మినిస్ట్రేషన్ కోసం రూ 155.50 లక్షలు, ఇంజనీరింగ్ రూ 108.50 లక్షలు, రిమునరేటివ్ ఎంటర్ ప్రైసెస్ రూ 67.50 లక్షలు, స్ట్రీట్ లైటింగ్ రూ 251 లక్షలు, ఎస్టేట్ రూ 71.50 లక్షలు, వాటర్ సప్లయ్ అండ్ డ్రైనేజీ రూ 659.50 లక్షలు, ఎడ్యుకేషన్ రూ 14 లక్షలు, ఎలిమెంటరీ విద్య రూ 67.50 లక్షలు, పబ్లిక్ హెల్త్ రూ 1947.50 లక్షలు, టౌన్ ప్లానింగ్ రూ 19.50 లక్షలు, వార్డు సెక్రెటరియేట్స్ రూ 106 లక్షలు, అమత్ లోన్, వడ్డీలు రూ 400 లక్షలు, ఇంజనీరింగ్ ఇఇఎస్ఎల్ చెల్లింపులు రూ 50 లక్షలు కౌన్సిల్లో పరిపాలనా అమోదం పొందాయి. అంతే కాక టేబుల్ ఎజెండాలో కోన రోడ్డు, రుద్రవరం విలేజిలోని కొత్తగా ఏర్పాటు చేసే డంపింగ్ యార్డు వైపు కల్వర్టు, గ్రావెల్ రోడ్డు రూ 24.96 లక్షల కాంట్రాక్టర్ టెండరు కౌన్సిల్ ఆమోదించింది. సంస్థ పరిధిలో లారీ ఒనర్స్ నుండి ఆసీలు వసూలు చేయకూడదనీ, లారీలు మార్కెట్లకు తీసుకొచ్చే వస్తువులు, గూడ్సలకు మార్కెట్ రుసుం వసూలు చేసేందుకు కౌన్సిల్ ఆమోదించింది. కౌన్సిల్ సమావేశంలో నిర్ణయాలన్నీ ప్రజాభిప్రాయం మేరకు లేవని, ఏకపక్షంగా నిర్ణయాలు చేశారని టిడిపి కార్పొరేటర్లు సమతా కీర్తి, చిత్త జల్లు రాము, అనిత, సుధాకర్, ఆనంద్ ఖండించారు. తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించి కౌన్సిల్ సమావేశాలు ముగించి మమ అనిపించారని అసహనం వ్యక్తం చేశారు. ఈ కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కమిషనర్ చంద్రయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని జనసేన వినతి

ప్రజాశక్తి - మొవ్వ

మండల కేంద్రమైన మొవ్వ నుండి కూచిపూడి వెళ్లే




వినతిపత్రాన్ని అందజేస్తున్న జనసేన నాయకులు

ప్రధాన రహదారి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ జనసేన నేతలు తహశీల్దారు సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి తాడిశెట్టి నరేష్, జిల్లా కమిటీ సభ్యులు కాకి ఝాన్సీ, అంబటి రాజ్యలక్ష్మి, మొవ్వ,పామర్రు మండల అధ్యక్షులు చలమలశెట్టి శ్రీనివాసరావు, జి.గంగాధర రావు, పోగ్రామింగ్స్ కమిటీ సభ్యులు మేరుగు సురేష్, మొవ్వ మండల ప్రధాన కార్యదర్శి చలాది ప్రవీణ్ కుమార్, నూకల పవన్,ఏనుగు వెంకటరత్నం, సింహాద్రి క్రాంతి కుమార్, కొప్పురాతి శ్రీకాంత్, పెదమద్దాలి మనోహర్, కిట్టు , జన సైనికులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడుల్లో రూ.1.44 లక్షల జరిమానా

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం రూరల్ సెక్షన్ లో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కూన వెంకటేశ్వర్లు ,మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం భాస్కరరావు ఆధ్వర్యంలో అధికారులు 38 బృందాలుగా ఏర్పడి 34 గృహ సర్వీసులు,32 వాణిజ్య సముదాయాలు, ఆక్వా 501 సర్వీసులు ఇతర సర్వీసులు 232 మొత్తం 799 సర్వీసులు తనిఖీ చేశారు. వాటిలో 13 సర్వీసులకు అదనపులోడు 72 కెడబ్ల్యు మొత్తానికి రూ.1.44 లక్షలు జరిమానాగా విధించారు. ఈ తనిఖీల్లో మచిలీపట్నం డివిజన్ లోని 4 డి ఈ ఈ లు, 10 మంది ఏ ఈ లు, 19 మంది లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్మెన్లు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి జోగి రమేష్

వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలి : జోగి

ప్రజాశక్తి-పెడన

ప్రస్తుత వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి లేకుండా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖామంత్రి జోగి రమేష్ కోరారు. పెడన పట్టణ మార్కెట్ యార్డ్ సమావేశ మందిరంలో బంటుమిల్లి మండలానికి చెందిన రెవెన్యూ, గ్రామీణ మంచి నీటి సరఫరా, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు శాఖ, హౌసింగ్, విద్యుత్ శాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ తదితర కీలక శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షిత మంచినీరు అందించే విధంగా అన్ని రకాల చర్యలు చేపట్టాలని కోరారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ వెలివెల చిన బాబు, జడ్పిటిసి మల్లి శెట్టి వెంకట రమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లిశెట్టి రాజబాబు, మత్సకార స్టేట్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాస రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలడుగు బాబూ రావు, వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారి బాబు, కొల్లా లలిత శేఖర్, మండల యువ నాయకుడు సుజ్ఞానం మహేష్, ఎమ్మార్వో ఎంవీ సత్యనారాయణ, ఎండిఓ స్వర్ణ భారతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, అన్ని గ్రామాల సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మంత్రి జోగి అభినందనలు

ప్రజాశక్తి-పెడన

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పెడన పట్టణ బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను మంత్రి జోగి రమేష్ తన కార్యాలయంలో మెమెంటో బహూకరించి, శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు. కే.ఎన్.వీ వైష్ణవి 572 మార్కులు, 572 మార్కులతో వి.నాగేశ్వరరావు, 570 మార్కులతో జి.మౌనిక, 567 మార్కులతో కే.జయ నాగ దుర్గ, 550 మార్కులు పైబడి మరో 10 మంది, 500 పైగా మార్కులతో 18 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరు జిల్లాలో మార్మోగేలాగా చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నిరంతరం విద్యారంగం అభివృద్ధి పాటుపడుతున్నారని వివరించారు.

రైతులకు పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి విజయభారతి

ప్రజాశక్తి-పమిడిముక్కల

జిల్లాలోని బాధిత రైతులకు పరిహారం చెల్లించటానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా వ్యవసాయ అధికారి విజయభారతి వెల్లడించారు. పమిడిముక్కల మండలంలోని పైడికొండపాలెంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా విజయభారతి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న విజయభారతి

మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకుంటోందన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న, పసుపు, అరటి వంటి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. దీనికి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ క్రమం తప్పకుండా పంట నష్ట అంచనాలు రూపొందించి నివేదికను సమర్పిస్తారన్నారు. అధికార యంత్రాంగం మానవతా దక్పధంతో పనిచేస్తోందన్నారు. రైతులకు మేలు చేసేలా కృషిచేస్తున్నామన్నారు. గన్నవరం వ్యవసాయ సంచాలకులు సునీల్, పమిడిముక్కల మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్రెడ్డి, వైసిపి నాయకుడు మైనేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పిఇటిలకు పర్మినెంట్ పోస్టులు కేటాయించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ

త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్ సంబంధించి పి ఈ టిలకు పర్మినెంట్ పోస్టులు కేటాయించి వారికి ప్లేసుల భద్రత కల్పించాల్సిందిగా పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాబ్జి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు కేటాయించబడ్డాయన్నారు. 2017 తర్వాత రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులను పిడి పోస్టులుగా అప్గ్రేడ్ చేశారన్నారు. ఈ విధంగా చేయడం వల్ల బీపీఈడి క్వాలిఫికేషన్ లేకుండా కొనసాగుతున్న పీఈటీలకు పర్మినెంట్ ప్లేసులు లేకుండా పోయాయన్నారు. ప్రస్తుతం పీఈటీలు అందరూ పీడీలకు కేటాయించిన పోస్టులలోనే పనిచేస్తున్నారన్నారు. త్వరలో జరగబోయే కౌన్సిలింగ్లు పీడీలు కోరుకున్న తర్వాతే మిగిలిన పోస్టులను పిఈటిలకు కేటాయిస్తామని గతంలో అధికారులు జీవో ఇచ్చారన్నారు. అవి కూడా పీడీ పోస్టులే కావడం చేత తర్వాత కౌన్సిలింగ్ లో ఎవరైనా పీడీలు ఆ పోస్టును కోరుకుంటే పి ఈ టి ఆ పోస్టులను ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు.

ప్రజలకు మరింత మెరుగైన సేవలు

ప్రజాశక్తి-పమిడిముక్కల

ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసి ప్రభుత్వ సేవలు పొందగలిగే విధంగా జగనన్నకు చెబుదాం అనే సరికొత్త కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని ఎంపీడీవో సుధా ప్రవీణ్ వెల్లడించారు. సిఎంకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ పి.రాజబాబు నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్లో పమిడిముక్కల మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలకు సంబంధించి ఎలాంటి సమస్య పరిష్కారానికైనా 1902 కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగుపరచి ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసి ప్రభుత్వ సేవలు పొందగలిగే విధంగా చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య, మారుపాక మహేష్, ఎంపీటీసీ గురిందపల్లి వంశీ, కో ఆప్షన్స్ సభ్యులు మీర్జా జనాయిత్ ఆలీ పాల్గొన్నారు.

దుర్గగుడిలో చైర్మన్ తనిఖీలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్ధానం, ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ దేవాలయం ప్రాంతంలోని కనకదుర్గ నగర్, మహామండపం నందు పలు ప్రదేశాల్లో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ఆకస్మిక తనిఖీలు చేశారు. శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు..అనంతరం కొండపైన బాలాల యం వద్ద ప్రసాదం కౌంటర్ తనిఖీ చేసి పులిహార ప్రసాదం భక్తులకు ప్రసాదం తయారీ కేంద్రం సిబ్బందితో మాట్లాడి పులిహారని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని చైర్మన్ సూచించారు.. ఇకపై ప్రతిరోజూ కౌంటర్లో తనిఖీలు నిర్వహిస్తామని చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు..

అమ్మవారిని దర్శించుకున్న ఉగ్రం చిత్ర నటులు :



శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్ధానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం మంగళవారం "ఉగ్రం" చిత్ర నటులు అల్లరి నరేష్, నటి మిర్ణా మీనన్ శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేసిన వారికి దేవాలయ అధికారులు అమ్మవారి దర్శనం చేయించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ట్రస్ట్ బోర్డు సభ్యులు బుద్దా రాంబాబు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సమైఖ్యలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ : ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా సమైఖ్యలను బలోపేతం చేయాలని నగరపాలక సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ (పి.ఒ-యుసిడి) కె శకుంతల అన్నారు. "మెప్మా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు"పై ఎస్ఎల్ఎఫ్/ టిఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని పి.ఒ శకుంతల మంగళవారం గుణదల సోషల్ సర్వీసు సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభుత్వ పథకాల అమలులో మెప్మా ఆర్‌పిల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి అంశంపై అవగాహన పెంచుకొని పథకాలపై సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయడానికి కృషి చేయాలని కోరారు. పేద ప్రజలందరికీ పథకాలు సక్రమంగా అందడానికి సమైఖ్యలను బలోపేతం చేయాల్సి ఉందని అన్నారు. వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసర, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, జగనన్న మహిళా మార్ట్, అర్బన్ మార్కెట్‌లపై ఆర్‌పిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్-3 రిసోర్స్ పర్సన్స్ , టెక్నికల్ ఎక్స్‌పర్ట్ జి విజయకుమారి, సిడిఒ-3 పి ఉమామహేశ్వరి, డిఆర్‌పి పి సుధారాణి, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లాకర్ బీరువా వితరణ

ప్రజాశక్తి -తిరువూరు : మండలంలోని గానుగ పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రవాస భారతీయుడు రాయల ప్రఫుల్ల రూ. 12 వేలు విలువ గల లాకర్ బీరువాను వితరణ చేశారు. మంగళవారం పాఠశా లలో జరిగిన సమావేశంలో ప్రధానోపా ధ్యాయులు ఆదిలక్ష్మికి దాత కుటుంబ సభ్యులు అందజేశారు. గతంలో కూడా ఇదే దాత పాఠశాలకు కలర్ ప్రింటర్ వితరణ చేసినట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా ఆమెతో పాటు ఉపా ధ్యాయులు ఎం.రాంప్రదీప్, డి.సుద ర్శన్, ఎం.సాంబశివరావు, ఎ.వెంకటే శ్వర్లు, బి.రాము దాతకు కతజ్ఞతలు తెలియజేశారు.



'జగనన్నకు చెబుదాం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజల వ్యక్తిగత స్థాయి సమస్యలను జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, స్టేట్ ట్యాక్స్ ఛీఫ్ కమీషనర్ గిరిజా శంకర్ అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "జగనన్నకు చెబుదాం" కార్యక్రమాన్ని మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయం నుండి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం గిరిజా శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలు సంక్షేమం కోసం అనేక పథకాలను అందించడంతో పాటు పారదర్శకమైన సేవలను గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజలకు ఎదురయ్యే వ్యక్తిగత సమస్యలను పరిష్కరించేందుకు వినూత్నమైన పద్ధతిలో స్పందన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగి జగనన్నకు చెబుదాం ద్వారా నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకునే అవకాశం కల్పించామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులు అర్హత ఉండి వైఎస్సార్ పెన్షన్ కానుక, రేషన్‌కార్డులు అందుకోవడంలో రెవెన్యూ రికార్డులకు సంబంధించిన సమస్యలతో పాటు ప్రభుత్వ సేవలకు సంబంధించి ఇతర వ్యక్తిగత ఇబ్బందులను 1902 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా జగనన్నకు చెబుదాం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ అధికారులు సాధ్యమైనంత వరకు ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా, జాయింట్ కలెక్టర్ డా. పి సంపత్ కుమార్, నగరపాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగరమేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటి మేయర్లు అవుతు శ్రీ శైలజారెడ్డి, బెల్లం దుర్గా, కార్పొరేషన్ చైర్మన్లు అడప శేషగిరి టి శ్రీకాంత్, కె. గీతాంజలి దేవి, యం శివరామకృష్ణ, టి పద్మావతి, కనకదుర్గ దేవస్థాన చైర్మన్ కె. రాంబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మహిళ రెజ్లర్ల క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజుభూషణ శరణ్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ, సిఐటియు, మహిళా సంఘం (ఐద్వా) విజయవాడ పశ్చిమ నగర కమిటీల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు పశ్చిమ కమిటీల ఆధ్వర్యంలో కె.బి.యన్ కళాశాల దగ్గర నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, మహిళా సంఘం (ఐద్వా) పశ్చిమ కార్యదర్శి గాదె ఆదిలక్ష్మి, సీపీఎం 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ రెజ్లర్ల అసోసియేషన్ అధ్యక్షులుగా, ప్రస్తుతం బిజెపి ఎంపీగా కొనసాగుతున్న బ్రిజు భూషణ్ సింగ్ మీద అత్యాచార కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని గత కొద్ది రోజులుగా మహిళా రెజ్లర్లు ధర్నాకు కూర్చున్నారని, కనీసం ప్రధాని గాని, కేంద్ర మహిళ మంత్రులు గాని వారి సమస్యలు గురించి పట్టించుకోకపోవడం సిగ్గుచేటుని అన్నారు. కనీసం క్రీడాకారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును కూడా అధికారులు ఖాతరు చేయడం లేదని అన్నారు. సింగ్‌ను తొలగించని పక్షంలో దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆందోళన ఉదతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పశ్చిమ నగర అధ్యక్షుడు బాలు, నాయకులు తేజ, భార్గవ్, మహిళ సంఘం నేతలు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు, సిఐటియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-మైలవరం : సుప్రీంకోర్టు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 13న స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.శైలజ మంగళవారం తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్ ,క్రిమినల్, మనోవర్తి ,ఎక్సైజ్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.రాజీ పడటం ద్వారా సమయము డబ్బు ఆదా చేసుకోవచ్చని తెలియజేసారు.లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా న్యాయవాదులు,పోలీస్ శాఖ వారు సహకరించాలని కోరారు.



జాబ్‌మేళా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మే 19న తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో నిర్వహించనున్న జాబ్ మేళా వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే రక్షణనిధి సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో నై పుణ్యత కలిగిన వారికి జాబ్ మేళా ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు పాల్గొన్నార

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే అమ్ముకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జొల్లగడ్డ గంగాధరరావు గర్నెపుడి వెంకట్రావు, సిహెచ్. రామిరెడ్డి, తోట తిరుపతిరావు, చామల సీతారామిరెడ్డి,మాడపాటి శ్రీనివాసరావు, స్వామి, ఏడీప శ్రీనివాసరావు,ఏవో సంధ్యారాణి రైతులు పాల్గొన్నారు.

వేసవిలో నగర వాసులకు

విజ్ఞానం...వినోదం...ఉల్లాసం

- నగరంలో బాహుబలి, రోబోటిక్ నమూనా ఎగ్జిబిషన్స్
- చిన్నారుల కోసం ప్రత్యేకంగా రైడ్స్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వేసవి సందర్భంగా నగర వాసులకు ఉల్లాసం ...వినోదం... కొరకు ప్రత్యేక సెట్టింగ్‌లతో నగరంలో రెండు చోట్ల ఎగ్జిబిషన్‌లను నిర్వాహకులుఏర్పాటుచేశారు. సాదారణంగా వేసవి శెలువు అనగానే నగరంలో వినోదంతో పాటు విజ్ఞానంకోసం పిల్లలు ఎంతో ఉత్సాహం చూపిస్తుంటారు. ఈవేసవిలో ప్రత్యేకంగా చిన్నారులు ఆహ్లాదంగా గడిపేందుకు నగరంలోని చుట్టుగుంట శాతవాహన కళాశాలలోనూ.., బృందావన్ కాలనీ లోని వజ్ర గ్రౌండ్స్ నందు ఎగ్జిబిషన్‌లను ఏర్పాటుచేశారు.

బాహుబలి నమూనా...

చుట్టుగుంట శాతవాహన కళాశాలలో చిన్నారులు, పెద్దలు అందరినీ అలరించిన బాహుబలి సినిమా సెట్టింగుల నమూనాతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈప్రదర్శన సినిమాలోని అన్ని ప్రధానమైన ఘట్టాలనుచిత్రీకరిస్తూ నమూనాలను ఏర్పాటుచేయడంతో సందర్శకులను ముఖ్యంగా చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. వీటితో పాటు చిన్నారులు ఆడుకునే విధంగా జెయింట్‌వీల్, కొలంబస్,టోరా టోరా, బ్రేక్‌డ్యాన్స్, ఏర్పాటుచేశారు. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సందడిగాఎగ్జిబిషన్ ఆకట్టుకుంటుంది. ఎగ్జిబిషన్‌లో వివిధ స్టాల్స్ ఆట వస్తువులు, ఫ్యాన్సీ స్టేషనరీ ఐటెమ్స్‌తో పాటు మహిళల కోసం చేతి వృత్తుల కళాకారుల వస్తువులు, సమ్మర్ వేర్ వస్త్రాలతో కూడినస్టాల్స్‌ను కూడా ఏర్పాటుచేశారు. ముఖ్యంగా చేనేత కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులను ఏర్పాటుచేశారు.

రోబోటిక్ ప్రదర్శన...

చిన్నపిల్లలు రోబోలుఅంతే ఎంతో ఆసక్తితో పాటు.. ప్రతి ఒక్కరూ రోబోల గురించి తెలుసుకోవాలని అనుకుంటారు. ఈవేసవిలో నగరంలో రోబోల నమూనాల ప్రదర్శనతో బృందావన్‌కాలనీలోని వజ్ర గౌండ్స్ నందురోబోటిక్ సెట్టింగ్‌లతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశారు. ఇందులో రోబోటిక్ హీరోస్ పేరుతో వివిధ ఆకృతులు ఏర్పాటుచేశారు. సూపర్ మ్యాన్, స్పైడర్ మ్యాన్, ఐరన్‌మ్యాన్, ఆక్వా మ్యాన్, జంగిల్ మ్యాన్, హీ మ్యాన్, బ్యాట్‌మెన్, వకాండ లేడీ, పవర్‌రేంజర్స్, హల్క్ డాక్టర్ స్ట్రేంజ్, కెప్టెన్ అమెరికా బొమ్మలు చిన్నారులను ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రదర్శనకు వచ్చిన చిన్నారులు రోబో నమూనాలతో సెల్ఫీలుదిగుతూ ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వీటితో పాటు పిల్లలు ఆడుకునే విధంగా అన్ని రకాలైన ఆట వస్తువుల, కొలంబస్, జైంట్‌వీల్ ఏర్పాటుచేశారు. సాయంత్రం వేళ చల్లని ప్రాంతంలో ఆనందంగా గడిపేందుకు నగర వాసులకు ఎంతగానో ఈఎగ్జిబిషన్స్ ఉపయోగపడుతున్నాయి.

